క్లుప్తంగా

శాంతియుత జీవనశైలి అలవర్చుకోవాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహిళా ఖైదీలు పరివర్తన గృహంలో శాంతియుత జీవన శైలిని అలవర్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన స్థానిక కేంద్ర కారాగారంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ, కారాగారంలోని మహిళలు ఎటువంటి విషయాల గురించీ ఆందోళన పడవద్దని అన్నారు. వివిధ నైపుణ్యాలు నేర్చుకోవడం వలన విడుదల అనంతరం ఆర్థికంగా బలపడేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మహిళలందరూ ఉచిత న్యాయ సేవలకు అర్హులని, దీనిని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులకు, పిల్లలకు సంక్షేమ పథకాలు అందకపోయినా, న్యాయపరమైన సమస్యలున్నా నిస్సందేహంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ, మహిళలకు, పిల్లలకు, బడుగు బలహీన వర్గాలకు సంస్థ అందిస్తున్న సేవలపై వివరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య, నాటక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, ఓఎన్‌జీసీ చీఫ్ జనరల్ మేనేజర్ మనీష శర్మ, జనరల్ మేనేజర్ సంగీత సాహు, మహిళా కారాగార సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి, కారాగారం వైద్యాధికారి డాక్టర్ పితాని కోమలి తదితరులు పాల్గొన్నారు.

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రికి నివాళి

కడియం: తిరుపతి వేంకటకవులు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసి, జంట కవులుగా ఖ్యాతి గడించారని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. జంట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి 74 వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామమైన కడియంలో శుక్రవారం జంట కవుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు, భగత్ సింగ్ సేవాసమితి అధ్యక్షులు తమ్మిశెట్టి ప్రసాద్, రైతు నాయకుడు చిక్కాల ఈశ్వరరావు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి పూజలు

కడియం: కడియపులంక పాత పువ్వుల మార్కెట్ వద్ద గల అభయాంజనేయస్వామిని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. అంతకు ముందు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన చిన్నారులకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికారు. అపర్ణా సమేత అనంతేశ్వరుడిని కూడా దర్శించుకున్నారు.

గోదావరి ఘాట్లలో పారిశుధ్య చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల పుణ్యస్నానాలు, పూజలు, పిండ ప్రదానాల అనంతరం ఘాట్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపు చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్టు నగరపాలక సంస్థ శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చారన్నారు. ఘాట్లలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా రెండు విడతలుగా సిబ్బందిని నియమించామన్నారు. కోటిలింగాల, పుష్కర, మార్కండేయ ఘాట్లలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు.

శంభో శంకర



సారంగధరేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ భరత్‌రామ్, మోనా దంపతులు



కోటిలింగాలపేటలో ఉమామలింగేశ్వరస్వామి రథోత్సవం

- ఘనంగా మహాశివరాత్రి పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- గోదావరి తీరంలో జన సునామీ



కడియపులంకలో అనంతేశ్వరునికి నవనీతాభిషేకం



మహాకాళేశ్వరాలయంలో శివునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సీటీఆర్ఐ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం నగరాన్ని భక్త సునామీ ముంచెత్తింది. గోదావరి తీరానికి భక్తులు పోటెత్తారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, సమీపంలోని ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. నగరంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. కోటిలింగాల క్షేత్రం, ఉమా మార్కండేయేశ్వర స్వామి, సారంగధరేశ్వరస్వామి, జాంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో, శంకరమఠం, శారదా పీఠంలోని స్పటిక లింగేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం కోటిలింగాల క్షేత్రంలో వైభవంగా రథోత్సవం నిర్వహించారు.

ఎంపీ భరత్‌రామ్ పూజలు

నగరంలో పలు శివాలయాలను ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్, మోనా దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆయా ఆలయాల అర్చకులు, కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక 48వ డివిజన్‌లో సారంగధరేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. గోదావరి గట్టున ఉన్న మార్కండేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల పేరుపైనా ఎంపీ భరత్‌రామ్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో అజ్జరపు వాసు, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో నగరంలో పలు చోట్ల శివలింగాలను ఏర్పాటు చేసి శివతత్వాన్ని బోధించారు.

శివరాత్రి నృత్యోత్సవం

నర్తన రుషి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆచార్యత్వంలో 41వ మహాశివరాత్రి నృత్యోత్సవం శైవాగమ వైభవాన్ని చాటేలా ఘనంగా సాగింది. శుక్రవారం రాత్రి మార్కండయేశ్వరుని సన్నిధిలోని నంది మండపంలో చిన్నారులచే ఆగమ శాస్త్రానుసారంగా నృత్యారాధన కార్యక్రమం జరిగింది. ఆద్యంతం శివనామ స్మరణతో సాగింది. ఆ చిన్నారులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్.శ్రీనివాస్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. సప్పా దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.



పుష్కరాల రేవు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

కడియం మండలంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి, దుళ్లలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి, జేగురుపాడులోని నగరేశ్వరస్వామి, వేమగిరి, వీరవరం, మురమండ, మాధవరాయుడుపాలెం గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కడియపులంక అపర్ణా సమేత అనంతరం స్వామి వారికి మహన్యాస పూర్వక అభిషేకం చేశారు.



రవి గీచిన శివుని నఖచిత్రం

వైభవంగా రథోత్సవం

కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి, దుళ్లలోని అగస్త్యేశ్వరస్వామి వార్ల రథోత్సవాలు వైభవంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య వేల మంది భక్తులు వెంట రాగా స్వామివారు రథంపై దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో రథోత్సవం సాగింది.

రూ.15 లక్షల చోరీ



సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగల చిత్రాలు

కంబాలచెరువు: ఇన్నీసుపేట ఎస్‌బీఐ శాఖ ఎదురుగా ఉన్న ఫైనాన్స్ ఆఫీసులో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు రూ.15 లక్షలు అపహరించుకుని పోయారు. వివరాల్లోకి శితే...పి.విజయ్ ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా షాపు అద్దెకు తీసుకుని హోమ్‌నీడ్స్ వాయిదాల పద్ధతిలో ఇస్తూ ఫైనాన్స్ చేస్తుంటాడు. అతను గురువారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. మర్నాడు ఉదయం వచ్చి చూసేసరికి షట్టర్ తీసి ఉంది. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలిపాడు. వారు వచ్చి ఆధారాలు సేకరించారు. ఫైనాన్స్ కార్యాలయంలోని టేబుల్ సొరుగు తాళాన్ని స్క్రూ డ్రైవర్‌తో తొలగించి అందులోని నగదును దొంగిలించుకుని పోయినట్లు ఆ ప్రాంతంలోనున్న సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. వారి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. దొంగల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 వేలు బహుమతిని ఇస్తామని సౌత్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

జగన్ పాలనకు అన్ని వర్గాల మద్దతు



బీజేపీ సతీష్ మిత్రబృందాన్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి వేణు



ధవళేశ్వరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు అన్ని వర్గాల నుంచి ఆదరణ లభిస్తోందని, అందుకే వైఎస్సార్ సీపీలో చేరికలు పెరిగాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ధవళేశ్వరం అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, మాజీ వార్డు మెంబర్ మేకా సత్యనారాయణ, వెలమ సంఘం నేత గండి అప్పారావు, ముస్లిం నాయకుడు ఎస్కే మస్తాన్ వలీ, రెల్లి సంఘ నేతలు రాగోలు జగ్గారావు, పాలకొండ సుదర్శన్, బొత్సగం గాధర్, విలకొండ రఘు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేసి రాబోవు ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, పార్టీ నాయకులు సుందరపల్లి అనిల్, నక్కా రాజేంద్ర, చింతపర్తి రాంబాబు, జుత్తుక వసంత్ పాల్గొన్నారు.

వంద మంది చేరిక..

నగరపాలకసంస్థ పరిధి 16వ డివిజన్ ఆవ ప్రాంతానికి చెందిన ఇదుసుమల్లి సతీష్ (బీజేపీ సతీష్) ఆధ్వర్యంలో వంద మంది యువకులు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. బీజేపీ సతీష్, ఆవ తేజ, ముర్రే ప్రకాష్, గోవింద్, ఏసు, బాలు తదితరులకు మంత్రి వేణు తన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా మంత్రి వేణు, నరేన్‌లను బీజేపీ సతీష్ మిత్రబృందం సత్కరించింది.

మహిళల అభ్యున్నతితోనే సమాజ ప్రగతి

సీటీఆర్ఐ: మహిళల అభ్యున్నతితోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల పార్కులో ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కోసూరి చండీప్రియ, బ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి కె.సూర్యకుమారి పాల్గొన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టాఫ్ చీఫ్ డాక్టర్ పీవీబీ సంజీవరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో ఎం. లలితా రమ్య, సరోజిని, నీలిమ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: విధి నిర్వహణలో మహిళా శక్తి అద్వితీయమని నగర పాలక సంస్థ శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాసరావు కొనియాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పుష్కరఘాట్ సమీపంలోని శానిటరీ కార్యాలయంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ వినూత్న, 20 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అల్లం ప్రసాద్, కార్యదర్శి సీహెచ్ కిరణ్, శానిటరీ మేస్త్రీలు గుత్తుల వెంకటరమణ, రాజ్ కుమార్, బి.రామ ప్రసాద్, భీమరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

లోకో పైలెట్లకు సన్మానం

నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్, గైడ్స్ రాజరాజ నరేంద్ర, గోదావరి ఓపెన్ గ్రూప్ అసిస్టెంట్ జిల్లా కమిషనర్ డి.ప్రసాద్ అన్నారు. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే భారత్ రాజమండ్రి విభాగం ఆధ్వర్యంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్లుగా పని చేస్తున్న జి.నవత, ఎస్.అలేఖ్యలను ఘనంగా సత్కరించారు.

కడియం: కమ్యూనిటీ పారామెడిక్స్-ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌ఎస్సీలో మహిళా దినోత్సవం నిర్వహించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర్, వైద్యులు మోహన వంశీ, అరుణ, సీనియర్ నర్సు వలీమాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కోశాధికారి యు.ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (బీఎంపీ) అసోసియేషన్ రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాప్నిక గాస్ట్రో అండ్ లివర్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో ఉభయ గోదావరి జిల్లాలో మొట్ట మొదటి మహిళా గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అయిన డాక్టర్ స్వాప్నికను సత్కరించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ లంక సత్యనారాయణ, రూరల్ మండల శాఖ అధ్యక్షుడు షేక్ సిద్ధబాబు, ప్రధాన కార్యదర్శి పైనా వీర వెంకటేశ్వరరావు, కోశాధికారి ఆర్. ఈశ్వర్ ప్రభు, ఉపాధ్యక్షులు వీపీ రమణ, బి.సరోజిని పాల్గొన్నారు.



మహిళా స్వాతంత్య్ర సమరయోధుల పార్కులో విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న విజయలక్ష్మి తదితరులు



ఎంహెచ్‌ఓ వినూత్న, పారిశుధ్య కార్మికులకు జ్ఞాపికలు అందజేసిన దృశ్యం

వాడవాడలా అన్నదానం.. శివరాత్రికి ప్రత్యేకం

సీటీఆర్ఐ: మహా శివరాత్రి రోజు నగరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా దేవస్థానాల్లో అన్నదానాలు ఘనంగా చేస్తారు. అలాగే నగరంలో వాడవాడలా ప్రజలు తమ శక్తి కొద్దీ భోజనం, ప్రసాదాల వితరణ చేయడం ఇక్కడి ప్రత్యేకం. ఈ నేపథ్యంలో శుక్రవారం అన్నదానాలు, ప్రసాద వితరణలు ఘనంగా జరిగాయి. గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. శ్రీపందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ పళ్లంరాజు, సూపరెంటెండెంట్ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో అన్నవితరణ జరిగింది. కేవీఆర్ రోడ్డులో మహాశివరాత్రి సేవా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు. దేవాంగ మహిళా సంఘం ఆధ్వర్యంలో పులిహోరా పంపిణీ చేశారు. అమ్మా టూరిజం అధినేత అమ్మవాసు మిత్రబృందం ఆధ్వర్యంలో గోదావరి గట్టు భవన రేవు వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. సీతంపేటలో జరిగిన కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లోని సీవీ రావు గార్డెన్స్‌లో శ్రీ సాయిభక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్స్ అధినేత వలవల చక్రపాణి, మోహిని దంపతుల ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం 29వ మహా అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు. ముందుగా ఆమంచి ఆంజనేయస్వామి గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ భక్తుడు శివన్నారాయణ (బాబీ) బృందం భజన కార్యక్రమం చేసింది.

చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో..

ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డాక్టర్ పర్వతవర్ధిని దంపతులు పార్టీ కార్యాలయం వద్ద పులిహోర పంపిణీ చేశారు.

కడియం మండలంలో..

కడియం: కడియపులంక పాత పువ్వుల మార్కెట్ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. మురమండ భద్రకాళీ ఆలయం, దుళ్లలోని అగస్త్యేశ్వరాలయం వద్ద దాతలు, భక్తుల సహకారంతో అన్నదానాలు నిర్వహించారు.



పులిహోరా పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్, పర్వతవర్ధిని దంపతులు



పందిరి మహాదేవుడు సత్రం వద్ద అన్నవితరణలో పాల్గొన్న సహాయ కమిషనర్ వీవీ పళ్లంరాజు తదితరులు



సీతంపేటలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ



జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రసాదం అందజేస్తున్న షర్మిలా రెడ్డి